


# 135
# మహాత్మా గాంధి-42

## మనభారతం  డా.వల్లూరుపల్లి శివాజీరావు



భారతావనిలో ఆంగ్లేయ పాలనకు వ్యతిరేకంగా జరిపిన శాసనోల్లంఘన ఉద్యమంలోని భాగంగా గాంధీ జీ నేతృత్వంలో జాతీయ కాంగ్రెసు పార్టీ జరిపిన అహింసాయుత సత్యాగ్రహమే ***ఉప్పు సత్యాగ్రహం***. దీని ని **దండి సత్యాగ్రహం; దండి యాత్ర; దండి మార్చి** అని కూడా పిలుస్తారు.

**ఉప్పు సత్యాగ్రహంకు కారణం**

1929 డిసెంబరు 31 న అర్ధరాత్రి సమయంలో, భారత జాతీయ కాంగ్రెస్ సభ్యులు లాహోర్ వద్ద రావి నది ఒడ్డున భారత త్రివర్ణ పతాకాన్ని ఎగరేయటం జరిగింది. గాంధీజీ, జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ, 1930 జనవరి 26 న సార్వభౌమాధికారం, స్వయం పాలన లేదా సంపూర్ణ స్వరాజ్యం గు రించి ఒక ప్రకటనను బహిరంగంగా విడుదల చేసింది. ఆ ప్రకటన ఇలా ఉంది:

*"ఇతర ప్రజల వలే, స్వేచ్ఛను పొందడం, వారి శ్రమ ఫలాలను ఆస్వాదించడం, జీవితావసరాలను తీర్చుకోగలిగి ఉండటం, తద్వారా వారు అభివృద్ధికి పూర్తి అవకాశాలు కలిగిఉండడం భారతదేశ ప్రజల హక్కు అని మేము నమ్ముతున్నాం. ఏ ప్రభుత్వమైనా ఈ హక్కులను ప్రజలకు అందనీయ కుండా చేసి, వారిని అణచివేస్తే, ఆ ప్రభుత్వాన్ని మార్చడానికి, రద్దు చేయడానికి ప్రజలకు పూర్తి హక్కు ఉందని మేము నమ్ముతున్నాం. భారతదేశంలోని బ్రిటిషు ప్రభుత్వం భారతీయ ప్రజల స్వేచ్ఛను హరించడమే కాక, ప్రజలను దోపిడీ చెయ్యటం పైనే ఆధారపడింది. భారతదేశాన్ని ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా సర్వనాశనం చేసింది. అందువల్ల, భారతదేశం బ్రిటిషు*

*సంబంధాన్ని తొలగించుకుని, సంపూర్ణ స్వరాజ్యాన్ని (అంటే, పూర్తి సార్వభౌమాధికారం, స్వయం పాలన) సాధించాలని మేము నమ్ముతున్నాం.”*

శాసనోల్లంఘనలో మొదటి చర్యను నిర్వహించే బాధ్యతను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ గాంధీజీకి అప్పగిం చింది. ఒకవేళ గాంధీజీని అరెస్టు చేస్తే, వెంటనే అయన బాధ్యతలు స్వీకరించడానికి ఇతర కాంగ్రెస్ నా యకత్వం సిద్ధంగా ఉంది.

ఆంగ్లేయ ప్రభుత్వం ఉప్పు మీద వేసిన పన్నును లక్ష్యంగా చేసుకుని సత్యాగ్రహంతో శాసనోల్లం ఘన ప్రారంభించాలన్నది గాంధీజీ ప్రణాళిక. 1882 ఉప్పు చట్టం (British Salt Act of 1882) ప్రకారం బ్రిటిష్ ప్రభుత్వం ఉప్పుపై పన్ను విధించి, దాని సేకరణ, పంపిణీ భాధ్యతలను ఆంగ్లేయులు నిర్వహించే ప్రభుత్వ ఉప్పు డిపోలకు మాత్రమే ఇవ్వటం జరిగింది. ఉప్పు చట్టం ఉల్లంఘించడం నేరం. సముద్రతీ రంలో నివసించేవారికి ఉప్పు ఉచితంగా లభించినప్పటికీ, భారతీయులు దీనిని వలస ప్రభుత్వం నుం చి కొనుగోలు చేయవలసిన పరిస్థితిని కల్పించింది.

### నిరసనగా ఉప్పే ఎందుకు?

తమ నిరసినను తెలియజేయటానికి ‘ఉప్పు సత్యాగ్రహం’ ఎంపిక సరిఅయినదని మొదట్లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భావించలేదు. దానికి బదులు భూమి శిస్తు బహిష్కరణ చేపడదామని వల్లభభాయ్ పటేల్ సూచించారు. చివరకు గాంధీజీ ప్రోద్బలంతో ఉప్పు సత్యాగ్రహం చేపడదామని నిర్ణయించటం జరిగింది దీనిని గురించి హేళన చేస్తూ వ్యంగంగా, స్టేట్స్‌మన్ పత్రిక ఈ విధంగా వ్రాసింది: “***ఇది అత్యం త హాస్యభరితమయిన విషయం. దీనిని బట్టి భారతీయుల మానసికస్థితి ఏస్థాయిలో ఉందో తెలిసిం ది***!”

ఉప్పు పన్నుకు వ్యతిరేకంగా జరగబోయే ప్రతిఘటన గురించి బ్రిటిషు ప్రభుత్వం, అధికారులు ఏ మాత్రం కలవరపడలేదు. స్వయంగా అప్పటి వైస్రాయ్ లార్డ్ ఇర్విన్ కూడా ఉప్పు నిరసన ముప్పును తీ వ్రంగా పరిగణించలేదు. అయితే తన నిర్ణయానికి గాంధీజీ మనసులో సరిఅయిన కారణాలే ఉన్నాయి. నిరసనలో రోజువారీ వాడుకలో ఉండే అంశం అయితే అది వెంటనే అన్ని వర్గాల పౌరుల ద్వారా ప్రతి ధ్వనిస్తుంది అని అయన నమ్మకం. ఉప్పు పన్ను ఆంగ్లేయ ప్రభుత్వానికి పన్నుల రూపంలో వచ్చే ఆదా యంలో 8.2 శాతం వరకు ఉంటుంది. తన ఎంపికను వివరిస్తూ గాంధీజీ “గాలి, నీరు తరువాత బహుశా ఉప్పే జీవితానికి అత్యవసరం” అని పేర్కొన్నారు.

పూర్ణ స్వరాజ్‌ను ప్రతి భారతీయుడికి అర్థమయ్యే విధంగా ఈ నిరసన నాటకీయంగా మారుస్తుం దని అయన అభిప్రాయపడటం జరిగింది. హిందువులు, ముస్లింలు ఇరు వర్గాలకు ముఖ్యమైన సమ స్యపై పోరాడటం ద్వారా వారిలో ఐక్యత పెరుగుతుందని కూడా ఆయన వాదించారు. నిరసన ఊపందు కున్న తరువాత, నాయకులు ఉప్పును శక్తికి చిహ్నంగా గ్రహించారు. అపూర్వమైన ప్రజాదరణ పొందిన ప్రతి స్పందన గురించి నెహ్రూ “ఒక నీటి బుగ్గ ఒక్కసారిగా పొంగినట్లు అనిపించింది” అని వ్యాఖ్యానిం చారు.

## ఉప్పు పాదయాత్ర సన్నాహాలు

ఉప్పు చట్టాలను ధిక్కరించడం కోసం గాంధీజీ మార్చి 12 న ఉప్పు సత్యాగ్రహం అహ్మదాబాదులోని సబ ర్మతి ఆశ్రమంలో ప్రారంభించి ఏప్రిల్ 6 న దండిలో ముగుస్తుందని వార్తా పత్రికలు వ్రాశాయి.

తన ప్రార్ధనా సమావేశాలలో గాంధీజీ వార్త పత్రికలతో మాట్లాడుతూ, ప్రకటనలు ఇస్తూ ప్రపంచ వ్యాప్తంగా ప్రసారమాధ్యమాలను ఈ ఉప్పు మార్చ్ (కవాతు)కోసం సిద్ధం చేశారు. తనను అరెస్టు చేస్తారని ఊహిస్తున్నానంటూ ఆయన పదేపదే చేసిన ప్రకటనలు, సమయం దగ్గరయ్యే కొద్దీ ఆయన భాషలో పె రుగుతున్న నాటకీయత ఉత్కంఠను పెంచాయి. ఆ సమయంలో "మేము జీవన్మరణ పోరాటానికి సిద్ధ మవుతున్నాము; ఒక ఈ పవిత్ర యుద్ధంలో దిగుతున్నాము; మేము మరణాన్ని ఆలింగనం చేసుకుని మమ్మల్ని మేమే నైవేద్యంగా సమర్పించుకుందామనుకుంటున్నాము" అని గాంధీజీ వెల్లడించటం జరి గింది. చలనచిత్ర సంస్థలతో పాటు, అనేక భారతీయ, యూరోపియన్, అమెరికన్ వార్తాపత్రికల కరస్పాం డెంట్లు, పాత్రికేయులు ఈ ప్రకటనలకు స్పందించి ఈ కార్యక్రమాన్ని తమ పత్రికలలో వెల్లడించారు.

ఈ మార్చి ద్వారా జరిపే సత్యాగ్రహానికి తన అనుచరులు అహింసకు, కఠోరమైన క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలని తెలియజేశారు. అందుచేత, గాంధీజీ నిరసనకారులను కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుం డి కాకుండా, తన క్రమశిక్షణా ప్రమాణాలలో శిక్షణ పొంది ఆరితేరిన తన సొంత ఆశ్రమంలోని సహవాసు లను ఎంచుకున్నారు. "ఈ పాదయాత్ర 24 రోజులపాటు, 4 జిల్లాలు, 48 గ్రామాలను దాటుతూ వెళు తుంది" అని తెలియజేశారు. సత్యాగ్రహ మార్గాన్ని, ప్రతి సాయంత్రం విశ్రమించే స్థలం, ఇతర వివరాల ను ఆయన ముందే నిర్ణయించారు. సాయంకాలం, రాత్రుల సమయంలో ప్రతి గ్రామంలోనూ చెయ్యాల్సిన కార్యక్రమాల ప్రణాళికను ముందే తయారుచేసి, వీటిని భారతీయ, విదేశీ పత్రికలలో ప్రచారం చేశారు గాంధీజీ.

1930 లో మార్చి 2 వ తేదీన గాంధీజీ వైస్రాయి ఇర్విన్ కు ఒక లేఖ వ్రాశారు. ఆ లేఖలో భూమి ఆదాయ అంచనాలను తగ్గించటం, సైనిక వ్యయాన్ని తగ్గించటం, విదేశీ వస్త్రాలపై సుంకం విధించటం, ఉప్పు పన్నును రద్దు చేయటం, తదితర డిమాండ్లను వైస్రాయి ప్రభుత్వం నెరవేర్చేటట్లయితే, తాను తలపెట్టిన మార్చ్ విరమిస్తానని అయన తెలియజేశారు.

"నా ఈ లేఖ మీ హృదయాన్ని కదిలించకపోతే, ఈ నెల పదకొండవ రోజున (మంగళవారం), ఉప్పు చట్టాల నిబంధనలను ధిక్కరించడానికి, నా ఆశ్రమ సహవాసులతో కలిసి మార్చ్ చేస్తూ ముందు కు వెళ్ళటం జరుగుతుంది. నిరుపేదల దృక్కోణం నుండి చూస్తే, ఉప్పు మీద విధించిన ఈ పన్ను అన్ని టికన్నా అత్యంత హేయమైనదని, అన్యాయమైనదని నేను భావిస్తున్నాను. సార్వభౌమాధికారం, స్వ యంపాలన కోసం తలపెట్టిన ఈ ఉద్యమం ఈ దేశపు

అత్యంత నిరుపేదల కోసమే. ఈ ఉద్యమానికి అసలు కారణం మీ దుష్ట పాలన అంతం చేయటం కోసమే" అని గాంధీజీ నిరుద్వంద్వంగా తెలియ జేశారు. కాని గాంధీజీ వ్రాసిన లేఖను, ఆయన తలపెట్టిన 'ఉప్పు పాదయాత్ర' ను వైస్రాయి తృణీకరిం చి, పట్టించుకోలేదు. కనీసం గాంధీజీని కలవటానికి కూడా నిరాకరించాడు ఆయన!

వైస్రాయ్ నిర్లిప్తతను, అనాసక్తిని గమనించి గాంధీజీ ముందే నిర్ణయించినట్లు మార్చ్ 12న (బుధ వారం) ప్రారంభించారు. ప్రారంభించే ముందు "నేను మోకాళ్లపై వంగి నేను రొట్టె ఇమ్మని అడిగాను, బదులుగా ఆయన నాకు రాయి ఇచ్చారు" ("On bended knees, I asked for bread and I have received a stone instead") అని వైస్రాయ్ ఇర్విన్ గురించి గాంధీజీ వ్యాఖ్యానించారు. ఉప్పు పాద యాత్ర ముందురోజు సాయంత్రం ప్రార్థనలో గాంధీజీ చెప్పేది వినడానికి వేలాది మంది భారతీయులు సబర్మతికి చేరు కున్నారు. అమెరికన్ పత్రిక 'The Nation' ఇలా పేర్కొంది:

***"గాంధీజీ ఇచ్చే పోరాట ప్రకటన వినడానికి 60,000 మంది ప్రజలు సబర్మతి నదీ తీరాన గుమిగూడారు. ఈ పోరాటపు పిలుపు బహుశా ఇప్పటివరకు అయన ఇచ్చిన పిలుపులన్నిటిలో విలక్షణమైనది."***

దండి పాదయాత్ర

గాంధీజీ నాయకత్వంలో దండి పాదయాత్ర 1930 మార్చి 12 న (బుధవారం) గుజరాత్ లోని 'నవసారి' (Navsari) జిల్లాలోని సబర్మతి నదీ తీరాన ఉన్న 'సబర్మతి ఆశ్రమం' నుంచి ప్రారంభమయింది. మొదట్లో ఆయనతో పాటు 80 సత్యాగ్రహులు వెంట నడవటం మొదలుపెట్టారు. ఈ సత్యాగ్రహుల్లో చాలామంది నిమ్నకులాల వారు కూడా ఉన్నారు. వారి గమ్యం 390 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుజరాత్ తీర గ్రామం '***దండి***'. తెల్లటి ఖద్దరు దుస్తులు ధరించి సత్యాగ్రహులు నడుస్తూ ఉంటే, అనేక మంది శ్వేతవస్త్రధారు లు ఈ ప్రవాహంలో చేరి వెంట నడుస్తూ ఉంటే, ఈ '***ఉప్పు కవాతు***' తెల్లటి నదీ ప్రవాహంలా ఉందని పాత్రికేయులు, సందర్శకులు వర్ణించారు. కొన్ని దేశీయ వార్తాపత్రికలు, ముఖ్యంగా అధికార వార్తాపత్రిక 'The Statesman', సబర్మతి–అహ్మదాబాద్ రహదారిపై ప్రతిరోజు కనీసం 1,00,000 (లక్ష) మంది ప్రజలు ఈ 'ఉప్పు కవాతు' ను చూశారని వ్రాశాయి.

మొదటి రోజు పాదయాత్ర 21 కి.మీ. దూరం సాగి, Aslali, (అస్లాలీ) గ్రామంలో ముగిసింది. అక్కడ గాంధీజీ సుమారు 4,000 మంది జనసమూహంతో మాట్లాడారు. అస్లాలీ, చుట్టుప్రక్కల గ్రామాలలో స్వ చ్ఛంద సేవకులు (వాలంటీర్లు) విరాళాలు సేకరించి, కొత్త సత్యాగ్రహులను నమోదు చేశారు. అనూహ్యం గా బ్రిటిషు పాలనకు సహకరించకూడదని నిర్ణయించుకున్న అనేక మంది గ్రామాధికారులు తమ ఉద్యో
గాలకు రాజీనామా చేయటం జరిగింది.

సత్యాగ్రహులు ప్రతి గ్రామంలోకి ప్రవేశించగానే, డప్పులు కొడుతూ, చేతాళాలు వేస్తూ జనం నిరస నకారులను స్వాగతించారు. ఉప్పు పన్ను అమానుషమని చెబుతూ, ఉప్పు సత్యాగ్రహాన్ని “పేదవాడి పో రాటం” గా గాంధీజీ అభివర్ణించారు. వారు రాత్రిళ్ళు బయటే పడుకునేవారు. తినడానికి తిండి, త్రాగ టానికి, చేతులు కడుక్కోటానికి నీరు మాత్రమే వారు గ్రామస్తులను అడిగేవారు. ఈ విధంగా పేదలను ఈ పోరాటంలో తీసుకురావటానికి వీలయిందని గాంధీజీ అభిప్రాయపడ్డారు.

ఈ పాదయాత్రలో వేలాది మంది సత్యాగ్రహులు, సరోజినీ నాయుడు వంటి నాయకులు గాంధీ జీతో కలిశారు. ప్రతిరోజూ, కవాతులో కొత్తవారు చేరారు. చివరికి ఈ పాదయాత్ర ప్రతి రోజూ కనీసం 14-15 కి.మీ. జరిగింది. వారి ఉత్సాహాన్ని నిలుపుకోవటానికి, పాదయాత్రలో నిరసనకారులు ‘***రఘుపతి రాఘవ రాజా రామ్***’ భజన పాడారు.

సూరత్ పట్టణం చేరినప్పుడు పాద యాత్రీకులను 30,000 ప్రజలు స్వాగతించారు. అచ్చట నుం డి దండి రైల్వేస్టేషను వద్దకు చేరుకున్నప్పుడు (దూరం 48-49 కి.మీ.) అక్కడ 50,000 మందికి పైగా గుమి గూడారు. దారి పొడవునా గాంధీజీ ఇంటర్వ్యూలు ఇచ్చి, వ్యాసాలు వ్రాయటం జరిగింది. న్యూస్‌రీల్ ఫుటేజీని చిత్రీకరిస్తున్న విదేశీ పాత్రికేయులు, కొన్ని ముంబాయి సినిమా కంపెనీలు, యూరోప్ దేశాలలో, అమెరికాల్లో గాంధీజీని ఇంటింటికీ పరిచయం చేశాయి. న్యూయార్క్ టైమ్స్ ఈ ఉప్పు యాత్ర గురించి దాదాపు ప్రతిరోజూ వ్రాయటం జరిగింది. ఏప్రిల్ 6, 7 తేదీలలో అయితే, రెండు మొదటి పేజీలలో ఉప్పు యాత్ర కథనాలను ప్రచురించింది.

ఏప్రిల్ 5 వ తేదీన (శనివారం) దండి చేరుకున్న తరువాత గాంధీజీ “బలవంతుడితో చేసే ఈ హ క్కుల పోరాటంలో నాకు ప్రపంచ మద్దతు కావాలి” అని ప్రకటించారు. ఆ సమయంలో తనను కలిసిన అసోసియేటెడ్ ప్రెస్ (Associated Press, New York) ప్రతినిధితో గాంధీజీ తాను చేపట్టిన ఉప్పు సత్యా గ్రహం గురించి ఇలా వివరించారు:

“పాదయాత్ర పొడుగునా ఆంగ్లేయ ప్రభుత్వ అధికారులు ఏమాత్రం జోక్యం చేసుకోకపోవటాన్ని నేను అభినందించకుండా ఉండలేను.... ఇది వారిలో వచ్చిన నిజమైన హృదయ పరివర్తన అని, వారి విధానాల్లో వచ్చిన మార్పు అని నమ్మేటట్లుగాఉంటే ఎంతో బాగుండును..... అత్యంత జనాదరణ పొం దిన ఈ ఉప్పు సత్యాగ్రహ ఉద్యమం పట్ల శాసనసభలో వారు చూపిన అనాసక్తినీ, వారి అధికార దర్పాన్నీ గమనిస్తే, భారతదేశాన్ని నిర్దయగా దోపిడీ చెయ్యాలనే వారి విధానం ఎట్టి పరిస్థితిలోనైనా కొనసాగిస్తార నటానికి ఏ సందేహమూ ఉండనవసరం లేదు.... అందువల్ల అధికారులు జోక్యం చేసుకోకపోవటానికి నేను చెప్పే ఏకైక వివరణ ఏమిటంటే, బ్రిటిషు ప్రభుత్వం ఎంత బలమైనదైనా, ప్రపంచ అభిప్రాయం పట్ల భయపడుతూనే ఉంటుంది. మా ఈ శాసనోల్లంఘన నిస్సందేహంగా ఒక అత్యంత తీవ్రమైన రాజ కీయ ఆందోళన. శాసనోల్లంఘన శాంతియుతంగా, అంటే అహింసాత్మకంగా, ఉన్నంతకాలం ఇలాంటి

ఆందోళనలను అణచివేస్తే ప్రపంచం సహించదు. ఈ పాదయాత్ర యెడల సహనంగా ఉన్న ప్రభుత్వం, రేపు ప్రజలు అసంఖ్యాకంగా ఇతర ప్రజావ్యతిరేక చట్టాలను ధిక్కరించినపుడు కూడా ఇంతే సహనంగా ఉంటుందో లేదో చూడాలి.”

మరుసటి రోజు (ఏప్రిల్ 6: ఆదివారం) ఉదయం, ప్రార్థన తరువాత, గాంధీజీ ఉప్పుతో కలిసిఉన్న మట్టి బురదను పైకి లేపి, “దీనితో, నేను బ్రిటిషు సామ్రాజ్యపు పునాదులను కదిలిస్తున్నాను” అని ప్రకటించారు. ఆ తరువాత మట్టి బురదను సముద్రపు నీటిలో ఉడకబెట్టి, బ్రిటిషు చట్టాన్ని ధిక్కరిస్తూ ఉప్పును తయారు చేశారు. తనతో ఉన్న వేలాది మంది అనుచరులతో పాటు సముద్ర తీరాన ఉన్న ప్రజ లను “ఎక్కడ వీలుగా ఉంటే అక్కడ” ఉప్పును తయారు చేయమని కోరటం జరిగింది. ఇతర ప్రదేశాలలో ఉన్న గ్రామస్థులను కూడా ఉప్పును తయారు చేయమని ఆయన కోరారు.



ఉప్పు సత్యాగ్రహంలో 61 ఏళ్ల గాంధీజీ



పాదయాత్రలో మహాత్మా గాంధీజీతో శ్రీమతి సరోజిని నాయుడు



ఉప్పు యాత్ర ముగించిన సమయంలో వంగి ఉప్పు గల్లును పట్టుకున్న గాంధీజీ.
ఆయన వెనక ఉన్న ఆయన రెండవ కుమారుడు మణిలాల్ గాంధి.




"I want world sympathy in this battle of Right against Might---Dandi: MK Gandhi; 5-4-'30"

సబర్మతి నుంచి దండి సత్యాగ్రహం పాదయాత్ర మార్గం March 12 to April 5, 1930; గాంధీజీ స్వహస్తంతో

ఉప్పు సత్యాగ్రహ పాదయాత్ర గురించి ఏప్రిల్ 5 సాయంత్రం దండి చేరినప్పుడు వ్రాసిన పదాలు.

*(75 ఏళ్ల తరువాత, 2005లో, మహాత్మా గాంధీ ఫౌండేషన్ విడుదలచేసిన చిత్రం)*

COMMENTS